# పరిహారం

-కోనె నాగవెంకట ఆంజనేయులు

సాయంత్రం కూర్మన్నపాలెంలో స్కూటర్ పార్క్ చేసి అక్కడినించి సిటీబస్‌లో ముప్ఫై కిలోమీటర్ల దూరంలో ఉన్న టౌన్‌కి వెళ్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లోనో, జగదాంబ జంక్షన్‌లోనో పనిచూసుకుని తిరిగి బస్‌లో కూర్మన్నపాలెం చేరుకుని స్కూటర్ మీద టౌన్‌షిప్‌లోని ఇళ్లకు తిరిగి రావడం మా ఉక్కు నగరవాసుల్లో చాలామందికి ఉన్న అలవాటు. రాత్రి ఎనిమిది దాటితే మా ఉక్కునగరంలోకి బస్సులు ఎక్కువగా రావు. అందుకే ఈ తతంగమంతా.

ఆరోజు సాయంత్రం అయిదుగంటలకు కూర్మన్నపాలెంలో స్కూటర్ పార్క్ చేసి బస్సెక్కి కాంప్లెక్స్‌లో బస్ దిగేం నేనూ, మా ఆవిడా. జగదాంబ జంక్షన్‌లో మా షాపింగ్ పని రెండు మూడు గంటలు పట్టవచ్చు. ఈలోగా కడుపులో ఏమైనా పడకపోతే లాభం లేదు.

"సాయిరాంలో టిఫిన్ చేసి వెళదామా?" అడిగేను మా శ్రీమతిని.

తనకోసం కాకపోయినా నేను రెండు, మూడు గంటల పాటు ఆకలికి ఉండలేనని తెలుసు మా ఆవిడకి. అందుకే వెంటనే సరే అంది.

ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర్లో ఉన్న పార్లర్లు అన్నిటిలోకి సాయిరాం పార్లర్ మాత్రమే ఎక్కువగా బిజీగా ఉండేది. కారణం మిగతా హోటల్లో కంటే అక్కడ టిఫిన్లు, చెట్నీలు శుభ్రంగా, రుచికరంగా ఉండడమంటారు మా విశాఖవాసులు.

క్రింద సెల్ఫ్ సర్వీస్. నిలబడే తినాలి. పైన టిఫిన్స్ సర్వ్ చేయడానికి సప్లయర్స్ ఉంటారా పార్లర్‌లో. కుర్చీల్లో కూర్చుని తినవచ్చు.

"పైకి వెళ్దాం! తాపీగా కూర్చుని టిఫిన్ చెయ్యొచ్చు" మా శ్రీమతి ప్రపోజల్ నాకూ నచ్చడంతో మెట్లెక్కి పైకి వెళ్లేం. క్రింద కంటే పైనే ఎక్కువ విశాలంగా ఉంటుంది.

రోడ్డు కనబడేలా చూసుకుని ఓ కార్నర్‌లో ఉన్న కుర్చీల్లో కూర్చున్నాం. మమ్మల్ని చూసి సప్లయర్ వచ్చాడు వెంటనే "ఏం కావాలి సార్!" అంటూ. మాకు కావలసిన టిఫిన్స్ ఆర్డర్ చేశాను.

లెక్కవేసి చూసి "నలభై రూపాయలివ్వండి సార్!" అన్నాడు సప్లయర్.

ఈ పార్లర్‌లో టోకెన్ సిస్టమ్ కాబట్టి బిల్ ముందుగానే పే చేసేయాలి.

జేబులోంచి వందరూపాయల నోటు తీసి ఆ కుర్రాడికి ఇచ్చాను. పది నిముషాల తర్వాత టిఫిన్స్ వచ్చాయి. పొగలు కక్కుతున్నాయి. ప్లేటు కారప్పొడి, కొబ్బరి చెట్నీతో లాగించి చెరో రవ్వ దోసె తిన్నాం కబుర్లాడుకుంటూ. నాకు కాఫీ, టీలు అలవాటు లేకపోవడంతో ఒక్క కాఫీ మా ఆవిడకే తెప్పించాను.

వాష్ బేసిన్ దగ్గర చెయ్యి కడుక్కుని మెట్లు దిగి బయటకి వచ్చేశాం. ఆటో ఎక్కి జగదాంబ జంక్షన్‌కి వెళ్లిపోయాం. మూడుగంటల పాటు ఆ జంక్షన్‌లో తిరిగి షాపింగ్ చేసి మాకు కావలసిన వస్తువులన్నీ కొనుక్కుని రెండుబస్సులు మారి కూర్మన్నపాలెంలో దిగేసరికి పదిదాటింది టైం. పార్కింగ్ లోంచి మా స్కూటర్ తీసుకుని ఇంటికి వచ్చేశాం.

భోజనాలైన తర్వాత మా ఆవిడ వంటిల్లు సర్దుకుంటూంటే నేను డబ్బులెక్కలు చూసుకోసాగేను. టౌన్లో మేం కొన్న సామాన్ల ఖరీదుల, బిల్లులున్న చోట బిల్లు మొత్తాలు, లేనిచోట జ్ఞాపకం తెచ్చుకుని ఓ పేపర్ మీద వేసి కౌంట్ చేశాను. బ్యాలెన్స్ టేలీ కావడంలేదు ఎన్నిసార్లు చెక్ చేసినా. ఓ అరవై రూపాయలు తక్కువ వస్తున్నాయి. ఇంకా ఏం కొన్నామా ని ఆలోచిస్తున్నాను.

అరవై రూపాల వస్తువేదో కొని మర్చిపోయి ఉంటానని కొన్ని వస్తువుల లిస్టు మళ్లీ చెక్ చేసుకోసాగేను. కానీ లెక్క తేలడం లేదు. బుర్ర వేడెక్కుతోంది. లెక్క తేలక పోతే నిద్రపట్టదు నాకు.

"ఇంకా తేలలేదా మీ లెక్కలు!" అడిగింది శ్రీమతి వంటగది తలుపు మూస్తూ.

"అదే చూస్తున్నాను గానీ నువ్వెళ్ళి పడుకో. నేను లెక్కలు చూసుకుని వస్తాను" అన్నాను.

"సాయిరాంలో టిఫిన్ బాగుంది కదండీ" అంది మా ఆవిడ బెడ్‌రూంలోకి వెళుతూ.

ఆ మాటతో చటుక్కున జ్ఞాపకం వచ్చింది నాకు ఆ అరవై రూపాయలు ఏమయ్యాయో.

హోటల్లో సర్వర్‌కి నేను వందరూపాయల నోట్ ఇచ్చాను. బిల్లు నలభైరూపాయలు పోగా తిరిగి నాకు అరవైరూపాయలివ్వలేదా రాస్కెల్.

నాకు జ్ఞాపకం లేదా విషయం. టిఫిన్ చేసి హడావుడిగా హోటల్ బయటికి వచ్చేశాం మేం. చాలా కోపం వచ్చింది నాకు ఆ సర్వర్ మీద. పొరపాటున నేను మరిచిపోతే ఆ సర్వర్ తనైనా జ్ఞాపకం ఉంచుకుని మిగతా చిల్లర తిరిగి తెచ్చివ్వాలి కదా నాకు. లేకపోతే కావాలనే చేశాడా? అడిగితే ఇద్దాంలే అనుకున్నాడేమో! ఇప్పుడేం చెయ్యగలను?

మేమున్నది ఊరికి ముప్ఫై కిలోమీటర్ల దూరంలో. మరునాడు వెళ్లి అడగడానికి కూడా వీలుకానంత దూరం అది. ఒకవేళ కష్టపడి ఆ హోటల్‌లోకి వెళ్లి అడిగినా తిరిగి ఇస్తాడన్న నమ్మకం ఏంటి? అసలు ఆ సర్వర్ ఎవరో ఎలా గుర్తుపట్టడం? గుర్తుపట్టగలిగినా 'మిగతా డబ్బులు అప్పుడే మీకు ఇచ్చేశాను సార్' అని దబాయిస్తే. నేను చెయ్యగలిగేది ఏమైనా ఉందా? లాభంలేదు. ఇంక ఆ డబ్బులు నా చెయ్యి జారిపోయినట్లే.

అన్ని విషయాల్లో ఎంతో జాగ్రత్తగా ఉంటానని పేరు నాకు. ఇంత అజాగ్రత్తగా ఎలా ఉన్నాను ఈ విషయంలో. ఈ విషయం మా ఆవిడకి చెప్పదలుచుకోలేదు. ఆవిడ ఊరికే బాధపడిపోతుంది. కనుక తనతో చెప్పకపోవడమే మంచిది.

ఆ అరవై రూపాయలు చిల్లరఖర్చుల్లో రాసేసి అకౌంట్ టేలీ చేసేశాను. రెండుమూడురోజుల తర్వాత ఆవిషయం మరుగునపడిపోయింది.

పదిహేనురోజుల తర్వాత మళ్లీ టౌన్ వెళ్లవలసిన పని బడింది. మా ఆవిడ తరఫు బంధువులెవరో మా ఇంటికి రాబోతున్నారు ఆ పై వారంలో.

"వాళ్లకి బట్టలు పెట్టాలి. ఆ మధ్య మనం వాళ్లింటికి వెళ్లినప్పుడు మీకూ, నాకూ ఇద్దరికీ బట్టలు పెట్టేరు వాళ్ళు" అని జ్ఞాపకం చేసింది మా ఆవిడ. మా టౌన్‌షిప్‌లో సరైన బట్టల షాపులు లేవు. అందుకే ఆ శనివారం నాడు టౌన్ ప్రోగ్రాం పెట్టుకున్నాం బట్టలు కొని తేవడానికి.

ఆరోజు సాయంత్రం ఆఫీస్ నుంచి రాగానే మామూలు ప్రకారం స్కూటర్ మీద వెళ్ళి కూర్మన్నపాలెంలో స్కూటర్ పార్క్ చేసి సిటీబస్‌లో ఆర్టీసీ కాంప్లెక్స్‌కి వెళ్లాం.

బస్ దిగిన వెంటనే ఎదురుగా కన్పించింది సాయిరాం పార్లర్. ముందు టిఫిన్ చేసేసి ఆతర్వాత పని చూసుకుందాం అని చెప్పి పార్లర్ వైపు దారితీశాం. వీలైతే మమ్మల్ని మోసం చేసిన ఆ కుర్రాణ్ణి గుర్తుపట్టగలిగితే వాడి మోసాన్ని బయటపెట్టాలన్నది నా ఆలోచన. పార్లర్ మెట్లెక్కి పైకి వెళ్లి పదిహేనురోజుల క్రితం మేం కూర్చున్న సీట్లలోనే కూర్చున్నాం.

కాసేపు తర్వాత సర్వర్ వచ్చాడు "ఏంకావాలి సార్!" అన్నాడు. నాకు కావలసింది ఆ కుర్రాడా కాదా అన్నది తెలియడం లేదు.


"ఎప్పుడూ నీ సర్వీస్ ఈ టేబుల్స్ దగ్గరేనా?" అని అడిగేనా కుర్రాణ్ణి.

"అవును సార్!" అన్నాడా కుర్రాడు.

అయితే వీడేనన్నమాట మమ్మల్ని మోసం చేసింది! కడిగేయాలి వెధవని.

"చూడు బాబూ! పదిహేనురోజుల క్రితం ఇదే టేబుల్ మీద టిఫిన్ చేశాం మేమిద్దరం. ఆరోజు నాకు ఛేంజ్ తిరిగి ఇవ్వలేదు నువ్వు" అన్నాను సౌమ్యంగా. ఆ కుర్రాడు అవునా కాదా అన్న అనుమానంతోనే.

గ్యారంటీగా ఆ కుర్రాడు "నేను కాదు సార్ ఆరోజు మీకు సర్వ్ చేసింది" అనో- "అలాంటిదేం లేదు సార్! మిగతా డబ్బులు ఆరోజే మీకు ఇచ్చేశాను" అనో అంటాడు. ష్యూర్! కానీ నేను అనుకున్నది జరగలేదు. ఆ కుర్రాడి ముఖంలో వెలుగు.



"మీరేనా సార్! ఆరోజు మీరు హడావుడిగా వెళ్లిపోయినట్లున్నారు. నేను లోపలినుంచి చిల్లర తీసుకుని వచ్చి చూసేసరికి మీ సీట్లు ఖాళీగా కనిపించాయి. నేను వెంటనే క్రిందికి దిగి వచ్చాను. రోడ్డు మీద కూడా మీకోసం చాలాసేపు వెతికేను సార్. మీరు కనిపించలేదు. మీ డబ్బులు నా దగ్గరే జాగ్రత్తచేశాను సార్" అంటూ జేబులోంచి ప్లాస్టిక్ కవర్ వేసి ఉన్న చిన్న నోట్‌బుక్ తీసి పేజీల మధ్యలోంచి చక్కగా నాలుగు మడతలు పెట్టబడి ఉన్న ఓ యాభైరూపాయల నోటూ, మరో పదిరూపాయల నోటూ తీసి నా చేతిలో పెట్టాడు.

నేను అవాక్కయ్యాను. నిర్ఘాంతపోయి అలా చూస్తూ ఉండిపోయాను. ఇంత నిజాయితీనా!

పదిహేనురోజులు గడిచిపోయినా ఏదో ఒకరోజున మేము మళ్లీ కనిపిస్తే ఆ డబ్బులు తిరిగి ఇచ్చేయాలన్న మంచి ఉద్దేశ్యంలో ఉన్న ఆ కుర్రాడి గురించినా నేను చెడుగా ఊహించుకున్నది. సిగ్గుగా అనిపించింది నాకు.

ఆ రోజు డబ్బులు మరిచిపోయి వెళ్లడం నా తప్పే. పైగా ఆ కుర్రాడు మోసం చేశాడని తిట్టుకున్నాను. కానీ ఎంత నిజాయితీపరుడా కుర్రాడు.

విభ్రాంతిలోంచి తేరుకుని మెల్లగా నాముఖంలోకి చిరునవ్వు వచ్చి చేరింది. నా చేతిలో ఉన్న రెండునోట్లలోంచి పదిరూపాయల నోటు తీసి ఆ కుర్రాడి చేతిలో పెట్టేను.

"ఇది నిజాయితీకి చిన్న బహుమానం. ఎప్పుడూ ఇలాగే నిజాయితీగా ఉండాలి. నీ నిజాయితీ ఎప్పటికైనా నిన్ను మంచి పొజిషన్‌లోకి చేరుస్తుంది" మనస్ఫూర్తిగా అన్నాను.

అటు తర్వాత ఎప్పుడు ఆ రెస్టారెంట్‌కి వచ్చినా ఆ టేబుల్ దగ్గరే కూర్చుని టిఫిన్ చేయాలనే నిర్ణయానికి వచ్చేను.

తొందరపడి నిజానిజాలు తెలుసుకోకుండా ఎవరిని గురించీ చెడు అభిప్రాయానికి రాకూడదన్న నిజాన్ని తెలుసుకున్నానీ సంఘటన ద్వారా.మా ఆర్డర్ తీసుకుని ఆ కుర్రాడు వెళ్లిపోయాడు. అయోమయంగా మా వైపు చూస్తున్న మా ఆవిడకు జరిగిందేమిటో వివరంగా చెప్పడం మొదలుపెట్టేను.

★